ఆఫీసరుగారికి కోకల పిచ్చి బాగా ఎక్కువని తెలుసుకున్న లోకనాథానికి మెదడులో ఓ మెరుపు మెరిసింది... వెనుక బడిపోయిన తన ప్రమోషన్‌ను, ఈ రూపేణా అయినా దక్కించుకోవాలని.

అప్పటి నుంచి తన ప్లాను ఫలించడానికి అవకాశం కోసం పొంచి చూస్తున్నాడు. ఆఫీసరుగారికి మాటిమాటికీ వంగి వంగి దణ్ణాలు పెట్టడమే కాక.. ఆ ఫైలు.. ఈ ఫైలు పుచ్చుకుని 'డిస్కషన్స్' పేరిట తరచు బంగళాకి కూడా వెళ్ళిరాసాగాడు.

ఆఫీసరుగారి బంగళా... ఆఫీసుకే కాక ఊరికి కూడా దూరంగా వుండడం లోకనాథానికి కలిసివచ్చిన అదృష్టం! ఆఫీసరుగారితో అతనికి చనువు పెరిగింది.

నడివయసులో తన భార్య చనిపోగా... మళ్ళీ పెళ్ళికి పిల్లనెవ్వరూ ఇవ్వడానికి ముందుకు రాకపోగా.. పరస్త్రీల పొందుకోసం వెంపర్లాడుతున్న ఆఫీసరు - లోకనాథం వలలో అతి తేలిగ్గానే పడ్డాడు.

మాట మెదిలితే లోకనాథం.. "మా ఆవిడుంది చూశారూ! ఆవడలు చేసిందంటే... నోట్లో వేసుకుని దవడలు కదపకుండా చప్పరించేంత మెత్తగా, రుచిగా వుంటాయి సార్!"

"మా శ్రీమతి ఇల్లు సర్దుతుందండీ... అద్దంలాగ మెరిసిపోవాల్సిందే!"

"నా వైఫ్ చాలా సోషల్ అండ్ కల్చర్డ్ టైప్ సార్!"

ఇలాటి డైలాగులు పదే పదే వల్లె వేసేసరికి కుదేలు కుదేలయిపోయాడు ఆఫీసర్. ఒళ్ళంతా పులకించిపోయి నరాలు జివ్వుమనసాగాయి... ఆ రసిక శిఖామణికి.

లోకనాథం భార్య కోక ఎప్పుడు విప్పేసి.. ఆమెలో అబగా ఐక్యమయిపోయి ఆనందంతో కేకలు (మనసులోనే!) వేద్దామా అని వుందాయనకి. లోకనాథం తన ప్రమోషన్ విషయంలో జరిగిన అన్యాయాన్ని పదే పదే చెప్పడం మొదలు పెట్టాడు — ఆ సందర్భంగానే చెప్పడం మనవం చేసుకోసాగాడాఫీసరు.

"మిస్టర్! లోకనాథం, నీకు నేను వెంటనే ప్రమోషన్ ఇవ్వదలుచుకున్నాను" అన్నాడు ఎరచూపిస్తూ.

"థాంక్యూ సార్!" మెలికలు తిరిగిపోయాడు.

"అయితే, ఒక షరతు!"

"ఏమిటి సార్?"

"మీ ఆవిణ్ణోసారి నా బంగళాకు తీసుకురా."

"ఎప్పుడు సార్?"

"రాత్రిపూట!"

"ఎందుకు సార్?" తెలిసి కూడా అడిగాడు, ఆయన నోటితోనే చెప్పించాలని.

"నా బొందకయ్యూ! ఈ మాత్రం కూడా అర్థం కాని మట్టిబుర్రటయ్యూ నీది?"

"చెప్పండి సార్! కోప్పడకుండా" బతిమాలాడు.

"అయితే విను! మీ ఆవిడ చేసే ఆవడల గురించి చెప్పేంతర్వాత నాకు నోరూరిపోతోంది! రేపు మధ్యాహ్నమే చేయించి రడీగా వుంచు. పగలెందుకు తీసుకు రావద్దన్నానంటే.. మన ఆఫీసు స్టాఫు ఎవరన్నా పసిగట్టారంటే.. మన ముగ్గురి మీద నిందలేసి వాళ్ళ బొంద పెట్టుకుంటారు. మీ ఆవిడకూ, నాకూ ఆ సంబంధం అంటగట్టేస్తారు... అంట సన్నాసులు! అందుకని రేపు రాత్రి తొమ్మిదింటికి ముసలి నౌకరు సుబ్బయ్యగాణ్ణి సెకండ్ షో సినిమాకి పంపిస్తాను. నువ్వు మీ ఆవిణ్ణే, ఆవిడ చేసిన ఆవడలనీ రాత్రి పదిన్నరకి ఈ బంగళాకి తీసుకురా! నువ్వు పెరట్లో అరటి చెట్ల కింద మంచమేసుకుని ఆకాశంకేసి సావకాశంగా చూస్తుండు! నేను మీ ఆవిడ చేసిన ఆవడలని ఆరగిస్తూ, అసలు వాటి నెలా చేస్తారో అడిగి తెలుసుకుంటాను. ఏం అంగీకారమేనా?"

"తప్పకుండా సార్! మరి నా ప్రమోషన్ ఆర్డరు.." అంటూ నసిగాడు లోకనాథం.

"మీ ఆవిడ ముందు నన్ను ఫూల్ చేద్దామనుకుంటున్నావేమిటోయ్! రాత్రి ఆవడ రుచి చూసిన నా అనుభూతి నీకు ఆఫీసులో ఉదయం పదిన్నర తర్వాత సీల్డు కవరు రూపంలో పదిలంగా దర్శనమిస్తుంది!"

"ఓ.కె. సార్. మీ దయ!"

ఆఫీసరుగారి కోరిక ప్రకారమే అంతా ఏర్పాటు చేశాడు లోకనాథం... మర్నాడు రాత్రి.

లైట్లు ఆర్పెయ్యడం..కిలకిలలు.. పకపకలు..

మర్నాటి ఉదయం పదిన్నర దాటింతరువాత ఆఫీసు అటెండరు సీలు వేసిన ఓ కవరందించాడు లోకనాథానికి.

దాన్నందుకుని లోకల్ డెలివరీ రిజిష్టర్‌లో సంతకం పెట్టి సంపించి అనుకున్నాడు లోకనాథం తన మనస్సులో — "నిజంగానే నా పెళ్ళాన్ని వాడి దగ్గరికి సంపించానను కుని ప్రమోషన్ ఆర్డర్ పంపించాడు పిచ్చిముండా ఆఫీసరువాడు! అది ఈ ఊరి డ్రామా నటి.. రామతిలకం అని ఆఫీసరు మాలోకానికేమి తెలుసు? ఓ రెండొందలు ఖర్చయితే అయినయ్. తనకు చాలా కాలంగా రాని ప్రమోషన్ వచ్చేసింది. హె! తనకన్నా తెలివైన వాడెవరుంటారీలోకంలో?! కోకల పిచ్చి ఆఫీసరుకే టోకరా ఇచ్చేశాడు!" పట్టరాని సంతోషంతో కవరు చించి చూసిన లోకనాథం గావుకేక వేసినంత పని చేశాడు!

ఆఫీసరు స్వయంగా సంతకం చేసిన టైపు చేయబడిన ఆ ఆర్డరులో... లోకనాథం కిచ్చింది 'ప్రమోషన్' కాదు, శంకరగిరి మాన్య పురానికి ట్రాన్స్‌ఫర్!!

దానికి భద్రంగా పిన్ చేయబడిన ఓ చిన్న స్లిప్పులో "లోకనాథం! ఆవడ ఏమీ.. బాగాలేదు! పెరుగు ఘోరంగా పులిసిపోయి, గారె పాచిపోయి తిని ఆనందించడానికి యోగ్యంగా లేదు. ఇంట్లో చేసిన ఆవడకు, బజారులో కొని తెచ్చిన ఆవడకు తేడా నేను గ్రహించలేననుకోవడం నీ అవివేకం. గుర్తించిన మోసానికి మోసమే బహుమానం. చదివి చింపెయ్! కింద నా సంతకం ఏమీ వుండదు. నీ తలను భూమిలోకి దించెయ్!"

—వడ్లమన్నాటికుటుంబరావు

